మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 139
పేజీలు : 3

గురువారం
11.12.2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## రియల్ ఎస్టేట్‌లపై ఈడీ దాడులు




**టి మీడియా ,డిసెంబర్ 10, హైదరాబాద్:** హైదరాబాద్ లో స్థిరాస్తి కంపెనీలో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహించారు. భువన తేజ రియల్ ఎస్టేట్స్, ఇన్‌ఫ్రాతో సంబంధం ఉన్న బహుళ కంపెనీలపై ఈడీ దాడులు నిర్వహించింది. ఫ్రీ లాంచ్ పథకం కింద కంపెనీ 70 కోట్లకు పైగా వసూలు చేసిందని ఆరోపించిన కేసులో మళ్ళీ సోదాలు జరిపింది. అనేక మంది పెట్టుబడిదారుల ఫిర్యాదుల మేరకు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో భువన తేజపై ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదైందని అధికారులు తెలిపారు. సీసీఎస్ కేసుపై చర్య తీసుకుంటూ ఈడీ తన సొంత విచారణను ప్రారంభించింది. ఈడీ బృందాలు హైదరాబాద్ అంతటా నాలుగు చోట్ల సోదాలు నిర్వహించాయి. వాటిలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం నివాసం, అనేక మంది సహచరుల ఇళ్ళు ఉన్నట్లు సమాచారం. పెట్టుబడిదారుల నుండి సేకరించిన నిధుల ప్రవాహాన్ని గుర్తించడం, ఆర్థిక నిబంధనలను ఉల్లంఘించి కంపెనీ డబ్బును మళ్లించిందా లేదా అనే విషయాన్ని పరిశీలించడం ఈ సోదాల లక్ష్యం అని దర్యాప్తు అధికారులు వివరించారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, డిజిటల్ రికార్డులను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

## నేడు మొదటి విడత

# పంచాయతీ






## పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం -రాష్ట్ర ఎన్నికల కమిషనర్

**టి మీడియా ,డిసెంబర్ 10, హైదరాబాద్ బ్యూరో:** తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మరికొద్ది గంటల్లో జరగనున్న ఎన్నికల్లో అభ్యర్థుల బలాబలాలు తేలిపోనున్నాయి. ఇప్పటికే ఎన్నికల సంఘం పోలింగ్?కు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేశారు. నిర్ణీత సమయానికి మండల కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లోని మండల కేంద్రాల్లో ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని తెలిపారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్న ఆమె తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని వెల్లడించారు. 50 వేల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉంటారని కమిషనర్ పేర్కొన్నారు.

### ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు

ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగుస్తుందని ఎన్నికల కమిషనర్? రాణికుముదిని అన్నారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. ఆ వెంటనే ఉప సర్పంచి ఎన్నికకు సంబంధించిన ప్రక్రియ కూడా ఉంటుందని స్పష్టం చేశారు. గురువారం 3,834 గ్రామాలు, 27,628 వార్డుల్లో పోలింగ్ జరగనుందని వెల్లడించారు.



### తెలంగాణ సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల తనిఖీల్లో రూ.8.2 కోట్లను సీజ్ చేసినట్లు లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ మహేష్ భగవత్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉందన్న ఆయన రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 50 వేల మంది సివిల్ పోలీసులు ఎన్నికల విధుల్లో ఉంటారని, అదనంగా 60 ప్లటూన్లను బయటి నుంచి రప్పించామని వెల్లడించారు. సర్పంచి పదవులకు వేలం పాటలపై కఠినంగా వ్యవహరించామని తెలిపారు. వేలం నిర్వహించిన గ్రామాల్లో కొందరిపై కేసులు నమోదు చేశామన్నారు. పోలింగ్ జరిగే మండలాల్లో సెలవు ఉంటుందని ప్రకటించారు.

### 21 గ్రామాల్లో దాఖలు కాని నామినేషన్లు

తొలి విడతలో పంచాయతీ ఎన్నికల్లో 21 గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. రేపు జరగబోయో సర్పంచ్ ఎన్నికల బరిలో 12,690 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వార్డుమెంబర్ల బరిలో 65,455 మంది అభ్యర్థులు నిలిచారు. మొత్తం 189 మండలాల్లోని 3,834 గ్రామాల్లో స్థానిక సమరం జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు .రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, ఈ ఎన్నికల్లో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. ఇప్పటివరకు అధికారులు తనిఖీల సమయంలో రూ.8.2 కోట్లు స్వాధీనం చేసుకున్నారని, న్నికల కమిషన్ తెలిపారు.

### ఈ సారి బ్యాలెట్ ఓటింగ్

సాధారణ ఎన్నికల్లో అందరూ ఈవీఎంలలో మీట నొక్కి ఓటు వేస్తారు. కానీ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బ్యాలెట్ ఓటింగ్. నచ్చిన అభ్యర్థి గుర్తుపై స్వస్తిక్ ముద్ర వేస్తే మీ ఓటు వారికి పడ్డట్లే. తెలిసీ తెలియక లేదా ఏమరుపాటుతో ముద్ర సరిగ్గా పడకపోయినా, ఇద్దరు అభ్యర్థుల మధ్య అటూ ఇటూ కాకుండా ముద్ర పడితే మీ ఓటు మాత్రం చెల్లుబాటు కాదు. ఖాళీ బ్యాలెట్ వేసినా అది చెల్లుబాటు కాదు. మీకు బ్యాలెట్‌లోని అభ్యర్థులెవరూ నచ్చకపోతే నోటా గుర్తుపై కూడా ఓటు వేయొచ్చు.

## రైతులకు బీమా.. ఇచ్చింది

# కేసీఆర్ ఒక్కడే

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**టి మీడియా ,డిసెంబర్ 10, రాజన్న సిరిసిల్ల :**జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు ఆత్మీయ భరోసా కార్యక్రమం బుధవారం జరిగింది. ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) బాండ్ల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆటోడ్రైవర్ లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దీక్ష సమయంలో ఉద్యమంలో పాల్గొన్న సబ్బండ వర్గాల్లో ఆటోడ్రైవర్ లు కూడా ముందుండి పోరాడారన్నారు.దేశంలో రైతులకు బీమా ఇచ్చిన నాయకుడు కేసీఆర్ ఒక్కడే అని, గీతన్నలకు, నేతన్నలకు బీమా ఇచ్చిన నాయకుడు కార్మిక పక్షపాతి కేసీఆర్ అని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ళలో మార్పు మార్పు అంటూ మోసం ఎలా ఉంటుందో అందరికీ అర్థం అయిందని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మష్రత్ అలీ ఆటోలో ఎక్కి హామీలు ఇచ్చిండని, నేడు అలీ రెండు ఆటోలు అమ్ముకుని, కిరాయి ఆటో నడుపుకుంటుండని ఎద్దేవా చేశారు. రైతులకు రుణమాఫీ చేశామని దేవుళ్ళపై అబద్ధపు ఒట్లు పెడుతున్నారు.420 హామీలు ఇచ్చి రాష్ట్రంలో అందరిని మోసం చేశారని, నెలకు వెయ్యి చొప్పున, రాష్ట్రంలో ఆటో డ్రైవర్లకు రెండేళ్లకు రూ.1560 కోట్లు అప్పు పడారని కేటీఆర్ వెల్లడించారు. జిల్లాలో అన్నిరకాల వాహనాల డ్రైవర్లకు సంక్రాంతి వరకు బీమా కల్పిస్తున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల వరకు ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు పెట్టకుంటే, హైదరాబాద్ లో మహాధర్నా చేద్దామని, కాంగ్రెసోడు ఊరికే ఇవ్వడు, గల్లా పట్టి అడిగితేనే ఇస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఓట్ చోరీ, నా ప్రెస్ కాన్ఫరెన్స్‌లపై చర్చ

### లోక్ సభలో రాహుల్ వర్సెస్ అమిత్ షా



**టీ మీడియా, డిసెంబర్ 10, ఢిల్లీ బ్యూరో :** తాను ఓటు చోరీ అంశంపై ఇచ్చిన మూడు ప్రెస్ కాన్ఫరెన్స్?లపై అమిత్ షా చర్చించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. బుధవారం లోక్?సభలో అమిత్ షా ఇచ్చింది పూర్తిగా రక్షణాత్మక, భయానక ప్రతిస్పందన అని ఆరోపించారు. ఈ మేరకు లోక్?సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా చేసిన ప్రసంగంపై రాహుల్ విమర్శలు గుప్పించారు.అమిత్ షా నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. ఇది పూర్తిగా రక్షణాత్మక ప్రతిస్పందన. పారదర్శక ఓటర్ల జాబితా ఇవ్వాలని నేను కోరాను. ఈవీఎంల ఆర్కిటెక్చర్?ను అందరికీ అందించాలని నేను చెప్పాను. హరియాణా, బిహార్?లో బీజేపీ నాయకులు ఓటు వేస్తున్నారని వెల్లడించాను. దాని గురించి సమాధానం లేదు. షా ప్రసంగంలో సీజేఐ ప్రస్తావన లేదు. మేము ప్రస్తావించిన ఏ అంశానికి షా సమాధానం ఇవ్వలేదు. ఆయన ఎన్నికల కమిషనర్‌కు పూర్తి రక్షణను కల్పించారు. అయినా మాకేం భయం లేదు" అని పార్లమెంట్ బయట రాహుల్ విలేకరులతో వ్యాఖ్యానించారు.

మిగతా 2లో..




## ఉద్యమాల పురిటిగడ్డ

# ఉస్మానియా



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మాస్టర్ ప్లాన్, క్యూఆర్ కోడ్ ను విడుదల
- అభివృద్ధికి వెయ్యి కోట్లమంజూరు న ఉత్తర్వు లు

**టి మీడియా ,డిసెంబర్ 10, హైదరాబాద్ బ్యూరో:**ఉద్యమ కాలంలో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థినీ విద్యార్థులు ఆకాంక్షించిన స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ముఖ్యమంత్రిఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చారిత్రాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గత వైభవం తీసుకురావడంతో పాటు

మిగతా 3లో..

## స్కూల్ పిల్లల ఆటో బోల్తా



### ఒకరు మృతి, 14 మందికి గాయాలు

**టి మీడియా ,డిసెంబర్ 10, కామారెడ్డి :** స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న ఆటో బోల్తాపడి పదవ తరగతి విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందారు. మరో 14 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ఈ ప్రమాదం జరిగింది. మండలంలోని సావర్గావ్ గ్రామం నుంచి ఖండే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తుండగా ఆటో బోల్తాపడింది.ప్రమాదంలో పదవ తరగతి విద్యార్థి ప్రణవ్ (15) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు

## తిరుమల పరకామణి చోరీ కేసు

### - హైకోర్టు కీలక ఆదేశాలు

**టి మీడియా ,డిసెంబర్ 10 ,తిరుమల :** తిరుమల పరకామణి చోరీ కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చోరీ కేసులో చట్టప్రకారం తగిన చర్యలు తీసుకునేందుకు సీఐడీ, ఏసీబీ డీజీలకు హైకోర్టు వెసులుబాటు ఇచ్చింది. పరకామణి చోరీ కేసును లోక్ అదాలత్ వద్ద రాజీ చేసుకోవటంతో పాటు నిందితుడు రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు కొనసాగించాలని ఆదేశించింది. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసేందుకు సేకరించిన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు సూచించింది.టీటీడీ మాజీ ఏవీఎస్‌వో సతీష్ కుమార్ పోస్టుమార్టమ్ సర్టిఫికేట్?ను సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్?కు అందజేయాలని సీఐడీకి ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారాన్ని అవసరమైన మేరకు ఇన్?కం ట్యాక్స్ డిపార్ట్మెంట్, ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్?తో పంచుకోవాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇటీవల సీఐడి, ఏసీబీ అధికారులు రెండు నివేదికలను హైకోర్టుకు సీల్డ్ కవర్?లో సమర్పించారు. ఆ నివేదికలను పరిశీలించిన అనంతరం హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. పిటీషన్ పై తదుపరి విచారణ ఈనెల 16కి వాయిదా వేసింది. పరకామణి చోరీ కేసును లోక్ అదాలత్?లో రాజీ చేసుకోవటంపై శ్రీనివాసులు దాఖలు చేసిన పిటీషన్ పై హైకోర్టు విచారణ జరిపింది.




### ఫిర్యాదుదారుడి పాత్రపై దర్యాప్తు

వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పరకామణిలో చోటు చేసుకున్న చోరీ కేసును ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్, నిందితుడు సీవీ రవికుమార్ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారాన్ని సీఐడీతో దర్యాప్తు చేయించాలంటూ పాత్రికేయుడు ఎం.శ్రీనివాసులు వేసిన వ్యాజ్యంపై ఈ ఏడాది అక్టోబర్ 27న హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపారు. కేసు రాజీ విషయంలో టీటీడీ బోర్డు, టీటీడీ అధికారులు, దర్యాప్తు అధికారి(ఐవో), ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్ పాత్రపై దర్యాప్తు చేయాలని సీఐడీ డీజీని జడ్జి ఆదేశించారు.మరోవైపు నిందితుడు సీవీ రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులు కూడబెట్టిన స్థిర, చరాస్తులతోపాటు బ్యాంక్ ఖాతాలపై దర్యాప్తు చేయాలని ఏసీబీ డీజీని ఆదేశించారు. రిజిస్ట్రేషన్లు మరే ఇతర మార్గాల ద్వారా రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులు విక్రయించిన, ఇతరులకు కేటాయించిన ఆస్తులపై దర్యాప్తు చేయాలని, ఆదాయానికి తగ్గట్టే వారు ఆస్తులు ఆర్జించారా? లేదా? అనే కోణంలో దర్యాప్తు ఉండాలని స్పష్టంచేశారు.లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే వ్యవహారాన్ని ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనానికి నివేదించిన విషయం తెలిసిందే. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ నిందితుడు సీవీ రవికుమార్ వేసిన అప్పీల్‌తోపాటు లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు సుమోటోగా నమోదు చేసిన వ్యాజ్యంపై సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.

# అధికారం కోసం కాదు అభివృద్ధి కోసం పని చేస్తా

**-బిజెపి రాష్ట్ర నాయకులు బి.ధారాసింగ్**



**టీ మీడియా ,డిసెంబర్ 10, చిన్నంబావి** :మండల కేంద్రంలోని బెక్కెం గ్రామంలో అధికార పార్టీకి దీటుగా ప్రత్యర్థ పార్టీలైన బిజెపి మరియు బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థి బొందులి కమల బాయి గెలుపు దిశగా ప్రచారం కొనసాగిస్తుమన్నారు. సమావేశంలో కార్యకర్తలు మాట్లాడుతూ బొందిలి కమల బాయి కుమారుడైన బిజెపి రాష్ట్ర నాయకులు ధారాసింగ్ కింది స్థాయి నుంచి వచ్చిన వ్యక్తి తనకి అధికార దాహంలేదని అభివృద్ధి కోసమే తనను తాను తగ్గించుకుంటు గతం లో మండలంలో ఎన్నో మంచి కార్యక్రమాలు అన్నగా ఆడపడుచులకు శ్రీమంతాలు, వృద్ధులకు కంటి ఆపరేషన్లు, అనారోగ్యంతో ఉన్నవారికి ఆర్థిక సహాయం, ఎన్ని రాజకీయా పార్టీలు మరీనా గుట్టలుగా ఉన్న బెక్కెం స్కూల్ ను క్రీడా ప్రాంగణంగా తీర్చి దిదడంలో ముందున్నారు యువతకి వ్యాపారానికి మరియు విద్యకు తనవంతు సహాయ సహకారం అందిస్తున్నారని ఇలా ఎన్ని చెప్పిన ఆయనకు ఆయనే సాటి అన్నారు. ఈ కార్యక్రమంలో ధారసింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలైన అభివృద్ధికి ఒక్క అడుగు కూడా వేయలేదని గ్రామ అభివృద్ధి జరగాలంటే అభివృద్ధి చేయాలనే సంకల్పం ఉండాలని బెక్కెం గ్రామంలో తగు నీటి సమస్య, స్మశాన వాటికకు రోడ్డు, ఆయకట్టు రోడ్ల పునరుద్ధరణ, అత్యవసరానికి అంబులెన్స్ సౌకర్యం, ప్రైమరీ హెల్త్ సెంటర్, ప్రతి వీధిలో సోలార్ లైట్లు, అత్యాధునికమైన క్రీడా ప్రాంగణం, తోబుట్టువు కింద ప్రతి ఆడపడుచుకు 5000 రూపాయలు ఆర్థిక సాయం, దేవాలయాలకు, మసీదులు, చర్చిల అభివృద్ధికి తను ఎప్పుడు ముందుటనని గ్రమ అభివృద్ధికి ఎన్నో మంచి కార్యక్రమాలు అమలు చేస్తానని హామీ ఇచ్చారు నాకు అధికార దాహం లేదని నా పుట్టిన ఊరికి అభివృద్ధిని చేసే అవకాశం ఇస్తారని మా అమ్మ బొందిలి కమలా బాయి ని సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టనని గ్రామ ప్రజలు గెలిపిస్తారని నమ్మకం ఉందన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు బిచ్చన్న, కాంతయ్య, కృష్ణ రెడ్డి, రామస్వామి, డి ఎన్ రాము, శ్రీరాములు, హరికాంత్, నరసింహ్మ రెడ్డి, శ్రీశైలం,వినోద్,మసుం కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# బీసీ సంఘం అధ్యక్షులుగా సర్వేశ్వర్ గౌడ్



**టీ మీడియా, డిసెంబర్ 10, పెబ్బేరు:** పెబ్బేరుమండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు ఆధ్వర్యంలో బీసీ సంఘం ముఖ్య సమావేశం నిర్వహించి మండల అధ్యక్షుడి నియామకం ఏర్పాటు చేయడం జరిగింది జాతీయ బీసీ సంక్షేమ సంఘం పెబ్బేర్ మండల అధ్యక్షులుగా సర్వేశ్వర్ గౌడ్ ను నియామకం చేసినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుందనాయుడు ప్రకటించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలు అందరూ కలిసి పోరాడితేనె సాధ్యమవుతుందనిమండల పరిధిలోని బీసీల సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేయాలని ఆర్ కృష్ణ య్యా నేతృత్వంలో జరిగే భవిష్యత్తు కార్యాచరణలో అందరూ పాల్గొనేలా చేసి బీసీల రిజర్వేషన్ ప్రక్రియలో కీలకంగా పని చేస్తూ బీసీ ప్రజానీకాన్ని చైతన్యం చేయాలని కోరారు బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆ విధంగా ఆర్ కృష్ణయ్య ఎల్లప్పుడూ పనిచేస్తూ ఉంటారని అందరం కలిసి బీసీల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు బీసీ నాయకులు కంచె ఆంజనేయులు అరవింద్ భూత్కూర్ బలరాం బజార్ భాస్కర్ జల్లి పవన్ లోకేష్ నవీన్ యోగి తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదం.. ముగ్గురు స్పాట్ డెడ్



**టి మీడియా ,డిసెంబర్ 10, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా జైనాథ్ మండలంలోని తరోడా గ్రామ శివార్లలోని జాతీయరహదారి-44పై బుధవారం తెల్లవారుజామున కారు బోల్తా పడటంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన 22 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల షేక్ మొయినుద్దీన్, కీర్తి సాగర్, మొయిన్ లుగా గుర్తించబడిన బాధితులు ఉదయం 5 గంటల ప్రాంతంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు.గాయపడిన వ్యక్తిని యోగేష్ గా గుర్తించారు. కారు బోల్తా పడటం గమనించిన కొందరు ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. మలుపు వద్ద డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడని, దీంతో ముగ్గురు ప్రయాణికులు మృతి చెందారని, యోగేష్ కు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు వెల్లడించారు. క్షతగాత్రున్ని ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు సూచించారు. ఈ నలుగురు మహారాష్ట్రలోని వాని నుండి ఆదిలాబాద్‌కు తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న జైనథ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం



**టీ మీడియా, డిసెంబర్ 10, పెద్దపల్లి:**పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గ పరిధిలోని కార్యక్రమంలో భాగంగాఅంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పెద్దపెల్లి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొండల రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో నూతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..
హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు చెన్నుపాటి శ్రీకాంత్ ఆదేశాల మేరకు, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి మాదాసి చారేంద్ర సూచనల మేరకు మానవ హక్కుల గురించి, నిత్యజీవితంలో మానవ హక్కుల ప్రాధాన్యత గురించి , భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని భారత ప్రజలకు రాజ్యాంగం అందించారని.రాజ్యాంగం భారత పౌరులుగా మనకు ఇచ్చిన ప్రతి హక్కులను వినియోగించుకోవాలని, సమస్య ఉన్న ప్రతి ఒక్కరికి రామగుండం అక్బర్ నగర్ లోని హెచ్ఆర్సీఐ జిల్లా కార్యాలయం ఎల్లవేళలా ఎప్పుడు అందుబాటులో, ఉంటుందని,సమస్యతో మా దగ్గరికి వచ్చిన వారికి పరిష్కారం దొరికే వరకు అండగా ఉంటామని రాజేందర్ కుమార్ తెలిపారు. తదనంతరం విటల్ నగర్ లోని అమ్మ పరివార్ అనాధాశ్రమంలో భోజన వసతి, వీర్లపల్లిలోని ఈశ్వరా కృప వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడం జరిగిందని రాజేందర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్సీఐ పెద్దపల్లి డిస్టిక్ ప్రెసిడెంట్ కొండల రాజేందర్ కుమార్,అడిషనల్ జనరల్ సెక్రెటరీ బొంకూరి కైలాసం, సిహెచ్ చంద్రకాంత్, జాగటి శాంతమ్మ, గుండవెల్లి లక్ష్మిఅబ్దుల్ సలీం, సిరికొండ కోటి, అజీమ్, రామ్మూర్తి, సరిత, మురళి, సాయి కుమార్,
తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
## అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్..



**టీ మీడియా, డిసెంబర్ 10,వనపర్తి ప్రతినిధి :** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఖిల్లా గణపురం మండలంలో గురువారం పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణములో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్ అన్నారు. బుధవారం ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయల ఆవరణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఘనపూర్ మండల పరిధిలో 27 సర్పంచి, 198 వార్డు మెంబర్ల స్థానాలకు గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు గాను పోలింగ్ సిబ్బంది మెటీరియల్ తీసుకొని తరలివెళ్ళారు.పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లను తీసుకొని కేటాయించిన గ్రామ పంచాయతీకి రూట్ వారిగా బస్సులో తరలివెళ్ళారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండ, భయబ్రాంతులకు గురి కాకుండా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం ముందు ఫారం-9లో అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తు పోస్టర్ అతికించాలని సూచించారు. తహసీల్దారు సుగుణ, ఎంపీడీవో విజయసింహారెడ్డి, తదితరులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# ఇంజినీరింగ్ అద్భుతం



## - ఆసియాలోనే తొలి రబ్బరు డ్యాంగా రికార్డ్?

**టి మీడియా ,డిసెంబర్ 10 , పార్వతీపురం :** ఆ నది ప్రవాహ ఉద్ధృతి ఎంత పెరిగినా దానిపై ఉన్న డ్యాం తట్టుకుని నిలబడుతుంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాదాపు 20 ఏళ్ల నుంచి చెక్కుచెదరకుండా ఉంది. 25 వేల ఎకరాలను సస్యశ్యామలం చేస్తోంది. అలాగని ఆ డ్యాం బలంగా నిర్మించారనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఆ ఆనకట్టకు లోతైన పునాదులు లేవు. భారీ కాంక్రీటు కట్టడాలు అంతకంటే లేవు. కేవలం మూడంటే మూడు మీటర్ల ఎత్తుతో ఓ సిమెంటు గట్టు. దానిపై ఓ రబ్బరు ట్యూబుతో మాత్రమే దానిని నిర్మించారు. అదే జంఝావతి నదిపై ఉన్న రబ్బరు డ్యాం. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం సమీపంలో ఉంది. దీంట్లోనే ఇంజినీరింగ్ అద్భుతమైన ప్రతిభ దాగి ఉంది.

**డ్యాం పనితీరు ఇలా**

ఈ నదికి అడ్డంగా మొదట తక్కువ ఎత్తులో ఓ సిమెంట్ గట్టును నిర్మించారు.? తర్వాత గట్టుపై ప్రత్యేకమైన రబ్బరు ట్యూబును అమర్చారు. డ్యాం పనితీరంతా ఈ ట్యూబుపైనే ఆధారపడి ఉంటుంది. సాధారణ ప్రవాహం ఉన్నప్పుడు ట్యూబులోకి షాఫ్ట్? ద్వారా నీరు వెళ్తుంది. నీరు చేరక ట్యూబ్ 3.5 మీటర్ల ఎత్తు పొంగి అ డ్డ క ట్ట లా గా మారుతుంది. అలా నీటిని కిందికి ప్రవహించకుండా ఆపుతుంది. ఒకవేళ ప్రవాహ ఉద్ధృతి ఎక్కువగా మారితే 'ఓవర్‌ఫ్లో సెక్షన్' అనే స్వయంచాలిత వ్యవస్థ పని చేసి ట్యూబు మూసుకుపోయితుంది.ఆ విధంగా నీటిని దిగువకు సాఫీగా వెళ్లేలా చేస్తుంది. ప్రవాహ వేగం తగ్గుముఖం పట్టిన వెంటనే మళ్లీ ట్యూబ్ కట్టలా మారి నీటిని నిల్వ చేస్తుంది. ఈ నిల్వ జలాలే కాలువల ద్వారా పొలాలకు చేరుతాయి. ఈ డ్యాం ఆటోమెటిక్?గా పనిచేసేలా నిర్మించారు. దీంట్లో కంట్రోల్, పంప్, ఫిల్లింగ్ షాఫ్టులు, వాల్వులు ఉంటాయి. కానీ, ప్రస్తుతం అవసరాలకు తగ్గట్లు ఒకరు ఆపరేట్ చేస్తున్నారు.

**ఇదీ నేపథ్యం**

అప్పటి ప్రభుత్వం మన్యంలోని పొలాలకు సాగునీరు అందజేయాలని భావించింది. ఆ ఉద్దేశంతో 1976లో జంఝావతిపై ప్రాజెక్టు కట్టాలని అనుకుంది. ప్రాజెక్ట్? కోసం ఏర్పాట్లు చేస్తున్న సమయంలో పక్కనున్న ఒడిశా ప్రభుత్వం అడ్డు చెప్పింది. అక్కడ డ్యాంను నిర్మిస్తే మా భూమి మునుగుతుందని వ్యక్తపరిచారు. ఈ క్రమంలోనే అంకురించిన ఆలోచనే ఈ రబ్బరు డ్యాం. దీనిని 2005లో రూ.124 కోట్లతో ఆస్ట్రియా సాంకేతిక పరిజ్ఞానంతో ఏడాదిలోనే రూపుదాల్చారు. ఆసియాలోనే తొలిసారి రబ్బరు డ్యాంగా రికార్డులో నిలిచింది.

**పునర్నిర్మాణంపై చర్చలు**

అంతరాష్ట్ర జల వివాదాల వల్ల ఈ ప్రాజెక్ట్ అభివృద్ధికి నోచుకోల్లేదు. అప్పుడు ఈ ప్రాజెక్ట్?కు 26,640 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.13.50 కోట్లతో ప్రతిపాదించారు. కానీ ఒడిశా ప్రభుత్వం అడ్డు చెప్పుండటంతో దానిని పరిష్కరించి పనులు చేపడతామని పాలక ప్రభుత్వాలు హామీ ఇస్తున్నా అవి అమలు కావడంలేదని అక్కడి రైతులు నిరాశ పడుతున్నారు. అంచనా వ్యయం ఏటా పెరుగుతూ వస్తుంది. దీనిపై అధికారులు చర్చలు జరుపుతున్నారు.

**ప్రాధాన్యత గుర్తించి ముందుకెళ్తాం**

ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న జలవనరుల ప్రాజెక్టుల పూర్తికి నిధులెంత కావాలి? ఆయకట్టు ఎంత పెరుగుతుంది? వాటి ప్రాధ్యానత అంశాలపై ఇంజినీరింగు అధికారులు సమగ్ర నివేదికను ఏర్పాటు చేశారు. దాన్ని పరిశీలించి సీఎం దృష్టికి తీసుకెళ్తాను. సమావేశమై ప్రాధాన్యతను గుర్తించి నిధులు మంజూరు చేస్తాం. ఏడాదికి మూడు నాలుగైనా పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కొన్ని నెలల క్రితం తెలిపారు.

# ఓట్ చోరీ,
## నా ప్రెస్ కాన్ఫరెన్స్‌లపై చర్చ

**అమిత్ షాపై రాహుల్ ఫైర్**

లోక్?సభలో అమిత్ షా చేసిన ప్రసంగంపై విపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ మేరకు కేంద్రం, ఈసీ, అమిత్ షా లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. "నిన్న ఎన్నికల కమిషనర్లకు పూర్తి రక్షణ ఎందుకు ఇచ్చారని నేను కేంద్రాన్ని నిలదీశాను. అమిత్ షా హరియాణా గురించి మాట్లాడారు. ఒక ఉదాహరణను ఉదహరించారు. ఇంకా చాలా ఉదాహరణలు ఉన్నాయి. అక్కడ 19 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారు. వాస్తవానికి, నా ప్రెస్ కాన్ఫరెన్స్?పై చర్చ జరపనివ్వండి. అమిత్ షా జీ, నా మూడు ప్రెస్ కాన్ఫరెన్స్‌లపై చర్చ జరపమని నేను మిమ్మల్ని సవాలు చేస్తున్నాను" అని రాహుల్ పేర్కొన్నారు.

**ధీటుగా బదులిచ్చిన షా**

అయితే లోక్?సభలో ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా రాహుల్ ఓట్ చోరీ ఆరోపణలపై అమిత్ ధీటుగా బదులిచ్చారు. రాహుల్ గాంధీ మూడు ప్రెస్ కాన్ఫరెన్స్ లతో సహా వారి అన్ని ఆరోపణలకు తన వద్ద సమాధానాలు ఉన్నాయని షా పేర్కొన్నారు. " ఎస్ఐఆర్ అంటే ఏమిటి? ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసే విధానం. ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసే వారిపై మాత్రమే ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుంది. 2014 తర్వాత బీజేపీ చాలా అరుదుగా ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. మీరు గెలిచినప్పుడు ఈసీ గొప్పది. మీరు ఓడిపోయినప్పుడు ఈసీ పనికిరానిది. ప్రజాస్వామ్యంలో ద్వంద్వ ప్రమాణాలు పనికిరావు" అని అమిత్ షా కౌంటరిచ్చారు. అయితే షా ప్రసంగానికి రాహుల్ అడ్డుతగలడంతో సభలో తీవ్ర వాగ్వాదం జరిగింది.

**ఎస్ఐఆర్ అనేది బ్యాక్ డోర్ ఎన్ ఆర్ సి : అసదుద్దీన్**

మరోవైపు, ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎస్ఐఆర్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ అనేది బ్యాక్ డోర్ ఎన్ఆర్?సీ అని అన్నారు. మతం ఆధారంగా ప్రజలను ఎంపిక చేసి ఓటు హక్కును తొలగించడానికే ఎస్ఐఆర్ అని మండిపడ్డారు. ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా ఒవైసీ కేంద్రం, ఈసీపై విమర్శలు గుప్పించారు. ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా చేయాలని కూడా పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్ పార్లమెంటరీ చట్టాన్ని ఉల్లంఘిస్తుందని నేను మొదట్లోనే చెప్పాను. ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం. మతం ఆధారంగా ఎంపిక చేసి ఓటు హక్కును తొలగించడం అనేది అధికారాన్ని దుర్వినియోగం చేయడమే. భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) సుప్రీంకోర్టు, పార్లమెంటు కంటే ఉత్తమమైనది కాకూడదు. ఎస్ఐఆర్ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం చేస్తున్నది తప్పు. పార్లమెంట్ ఆమోదించిన చట్టం పవిత్రతను ఈసీ దెబ్బతిస్తోంది'పౌరసత్వ సవరణ చట్టం పిటిషన్ ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించినప్పుడు, ప్రభుత్వం విదేశీయులకు మినహాయింపు ఉత్తర్వు జారీ చేసింది. ఎందుకంటే ఈ 3.66 లక్షల మందిలో ముస్లిమేతరులు కూడా ఉండవచ్చని ప్రభుత్వం గ్రహించింది. అందుకే ఎస్ఐఆర్ ప్రక్రియను బ్యాక్ డోర్ ఎన్ఆర్ సీ అని నేను చెబుతున్నాను అని ఒవైసీ వ్యాఖ్యానించారు.

# నిర్భయంగా నచ్చిన వారికి ఓట్లు వేయండి..

**-జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి..**



**టీ మీడియా, డిసెంబర్ 10,వనపర్తి ప్రతినిధి:** వనపర్తి జిల్లాలో నిర్వహించనున్న మొదటి విడత 5 మండలాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణములో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయడం జరిగిందని, ప్రజలు తమ అమూల్యమైన ఓటును తమకు నచ్చిన అభ్యర్థికి వేసుకోవాలని జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండ, భయబ్రాంతులకు గురి కాకుండా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకోవాలని సూచించారు.బుధవారం గోపాల్పేట, ఏదుల మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయల ఆవరణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఏదుల మండలంలోని 11 గ్రామ పంచాయతీల సర్పంచి స్థానాలు, 100 వార్డు మెంబర్లు, గోపాల్పేట మండల పరిధిలో 13 సర్పంచి స్థానాలకు, 119 వార్డు మెంబర్లు, రేవల్లి మండలంలో 9 సర్పంచి, 78 వార్డు మెంబర్లు, పెద్దమందడి మండల పరిధిలో 22 సర్పంచి, 180 వార్డు మెంబర్లు , ఘనపూర్ మండల పరిధిలో 27 సర్పంచి, 198 వార్డు మెంబర్ల స్థానాలకు గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు గాను పోలింగ్ సిబ్బంది మెటీరియల్ తీసుకొని తరలి వెళ్ళారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన వసతులను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రం ముందు ఫారం - 9 లో అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తు పోస్టర్ అతికించాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లను తీసుకొని కేటాయించిన గ్రామ పంచాయతీకి రూట్ వారిగా బస్సులో తరలి వెళ్ళారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య బట్టు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్, ఎంపీఓ తదితరులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# కామాటిపురాలో వ్యక్తి దారుణ హత్య



**టి మీడియా ,డిసెంబర్ 10, హైదరాబాద్:** కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవి బాగ్ సమీపంలో 30 ఏళ్ల అరవింద్ ఘోస్లే అనే వ్యక్తిని వెంబడించి, కత్తులతో దారుణంగా నరికి చంపిన దారుణ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దుండగులు మార్గమధ్యలో అతనిపై దాడి చేసి, అక్కడికక్కడే మృతి చెందారు. కామాటిపుర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాధితుడు కిషన్‌బాగ్‌లోని ముసలైగూడ నివాసి అరవింద్ ఘోస్లే (25) ఒక బియ్యం దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో దుకాణం మూసివేసిన తర్వాత, అరవింద్ తన మోటార్‌సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు.అతను దేవి బాగ్ స్ట్రెచ్ దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తుల బృందం అతనిని వెంబడించి, అతని బైక్‌ను అడ్డగించి హింసాత్మక కత్తితో దాడి చేసింది. ఈ దాడిలో అరవింద్ కు భారీగా కత్తిపోట్లు పడి అక్కడికక్కడే మరణించాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. వివాహితతో వివాహేతర సంబంధం ఉండటం వల్లే ఈ హత్య జరిగి ఉండవచ్చని ప్రాథమిక విచారణలో తేలింది. అయితే పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కామాటిపుర పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష కోసం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి, దాడి చేసిన వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

# రోడ్డుప్రమాదంలో నలుగురు కానిస్టేబుళ్లు మృతి




**టి మీడియా ,డిసెంబర్ 10, సాగర్:** మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో బాంబు స్క్వాడ్‌కు చెందిన నలుగురు కానిస్టేబుళ్లవాహనం కంటైనర్ ట్రక్కును ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందగా, మరొక పోలీసు తీవ్రంగా గాయపడ్డాడు. సాగర్ జిల్లాలోని బాంద్రి-మాల్థోన్ మధ్య జాతీయ రహదారి- 44పై తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. బాంబు గుర్తింపు, నిర్వీర్య దళ సిబ్బందిని తీసుకెళ్తున్న వాహనం, హైవే తప్పు వైపు ఆగి ఉన్న కంటైనర్ ట్రక్కును ఢీకొట్టిందని బాంద్రి పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి సుమేర్ జగత్ తెలిపారు.ఆ ప్రభావం చాలా తీవ్రంగా ఉండటంతో పోలీసు వాహనం తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో నలుగురు సిబ్బంది అక్కడికక్కడే మరణించారు. వారిని కానిస్టేబుల్ ప్రద్యుమన్ దీక్షిత్, కానిస్టేబుల్ అమన్ కౌరవ్, డ్రైవర్ పరమాలాల్ తోమర్, మొరెనా నివాసితులు, డాగ్ మాస్టర్ వినోద్ శర్మగా గుర్తించినట్లు అధికారి తెలిపారు. మరో కానిస్టేబుల్ రాజీవ్ చౌహాన్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అతన్ని భోపాల్ లోని బన్సాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతని పరిస్థితి విషమంగా ఉందని అధికారి తెలిపారు. ఆ బృందంలో భాగమైన ఒక కుక్క సురక్షితంగా ఉందని చెప్పారు. సమాచారం అందిన వెంటనే స్థానిక పరిపాలన, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రాథమిక విచారణలో పోలీసు వాహనం డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడని, అదే ప్రమాదానికి దారితీసిందని సుమేర్ జగత్ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ట్రక్ డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపినట్లు పోలీసులు తెలిపారు.




# బస్సు-ట్రక్కు ఢీ
## నలుగురు మృతి

**టి మీడియా ,డిసెంబర్ 10, జైపూర్:** రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలోని జైపూర్-బికనీర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి బస్సు ట్రక్కును ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, 27 మంది గాయపడ్డారు. బికనీర్ నుండి జైపూర్ వైపు స్లీపర్ బస్సు ప్రయాణిస్తుండగా ఒకదానికొకటి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మరణించారని, గాయపడిన 15 మందిని సికార్ జిల్లా ఆసుపత్రిలో చేర్పించగా, 13 మందిని ఫతేగఢ్‌లో ప్రాథమిక చికిత్స అందించారని పోలీసులు తెలిపారు.తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తిని సికార్ జిల్లా ఆసుపత్రి నుండి జైపూర్‌లోని ఎస్ఎంఎస్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారని పోలీసులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని వైద్యులు వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్ సందర్శించి గుజరాత్‌కు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

# ఏసీపీ మహ్మద్ మునావర్ పై వేటు



**టి మీడియా ,డిసెంబర్ 10, హైదరాబాద్:** కుల్సుంపుర ఏసీపీ మహమ్మద్ మునావర్పై వేటు పడింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు విచారణలో తేలడంతో చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఏసీపీ మునావర్ ను హెడ్ క్వార్టర్స్ కు అటాచ్ చేశారు. తాజాగా కుల్సుంపుర పోలీస్ స్టేషన్ సీఐ సునీల్ సస్పెండ్ అయ్యాడు. ఓ కేసులో నిందితుల పేర్లు మార్చి వారికి అనుకూలంగా వ్యవహరించినందుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు .

# ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి వెయ్యి కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ జారీ అయిన ఉత్తర్వులను విడుదల చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్, డిజైన్లను విద్యార్థుల సూచనల కోసం రూపొందించిన క్యూఆర్ కోడ్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 108 సంవత్సరాల చరిత్ర కలిగి దేశంలోనే అత్యంత పురాతన యూనివర్సిటీల్లో 7 వ స్థానం, దక్షిణ భారత దేశంలో 3 వ ప్రాధాన్యత కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ అలనాటి స్ఫూర్తితో భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకునే క్రమంలో అందరినీ కలవాలని వచ్చానని చెప్పారు. గుండె నిండా అభిమానంతో యూనివర్సిటీకి వచ్చా. ఆర్ట్స్ కాలేజీ ముందు నిలబడి విశ్వవిద్యాలయ అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికలు రచించడానికి వచ్చాను. ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఇక్కడికి వచ్చా. సమాజానికి ఏ సమస్య వచ్చినా యూనివర్సిటీ విద్యార్థులు కదలడం వల్లే ఆ సమస్యకు పరిష్కారం లభించింది. అందులో తెలంగాణ ఉద్యమం కూడా. ఉద్యమాలతో విద్యార్థులు ఏమీ ఆశించలేదు. వారు స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కావాలని అడిగారు. యూనివర్సిటీని కాలగర్భంలో కలపడానికి కొందరు కుట్రలు పన్నారు. ఉస్మానియా ప్రపంచానికి దిక్సూచిలా గొప్పగా ఎదగాలన్నది నా సంకల్పం. విద్య ఒక్కటే అందరి జీవితాల్లో వెలుగులు నింపుతుంది. వెనుకబాటు నుంచి బయటపడేస్తుంది. ఆత్మగౌరవం పెరుగుతుంది. తల్లిదండ్రుల్లో ఆనందం నింపుతుంది. చదువుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలి. సమస్యలొచ్చినప్పుడు నిటారుగా నిలబడి కొట్లాడండి. ప్రపంచాన్ని నడిపించగలరని నిరూపించాలి. నిబద్ధతతో కృషి చేయండి. ఇక్కడున్న వారిలోనే రేపు ఇలాంటి వేదిక నుంచి మాట్లాడే అవకాశం రావొచ్చు. మీలో కొందరు నాయకులై రాష్ట్రాన్ని పాలించాలని కోరుకుంటున్నా. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినట్టు అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. నిజమైన సంక్షేమం పేద వాడికి చేరాలి. సామాజిక సమస్యలపై శాశ్వత పరిష్కారం కావాలని మేం ప్రయత్నిస్తున్నాం. 30-40 ఏళ్లుగా రగిలిన వర్గీకరణ అంశం దళిత బిడ్డల మధ్య విభజన రేఖను గీసింది. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఈ సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన చేయలేదు. ఈ సామాజిక సమస్యను పరిష్కరించిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ. గడిచిన వందేళ్లుగా ఈ దేశంలో బలహీన వర్గాల లెక్కలు లేవు. ప్రభుత్వం ఆలోచన చేసి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ కుల రాజకీయ గణన పూర్తి చేశాం. తద్వారా కేంద్రంపై ఒత్తిడి పెరిగి 2026 లో చేపట్టే జన గణనలో ఆ అంశాన్ని చేర్చారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు. బడుగు బలహీన వర్గాలు, రైతులు, మహిళలు నిండుమనసుతో ఆశీర్వదిస్తేనే ఈ స్థాయిలో ఉన్నా. ఇలాంటి అవకాశం ఏ ఒక్కరికో వస్తుంది. అందుకే చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా ఏదైనా చేయాలన్న సంకల్పం నాలో ఉంది. అందుకే ఆలోచన చేసి విద్యార్థులంతా ఒకే క్యాంపస్ లో చదువుకోవాలన్న లక్ష్యంగా మహాత్మాగాంధీ గారి స్ఫూర్తితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ చేపట్టాం. విద్య కోసం పెట్టే ఖర్చు భవిష్యత్తరాల కోసం పెట్టుబడిగా చూస్తున్నాం. పిల్లల్లో నైపుణ్యాన్ని వెలికి తీయాల్సిన అవసరం ఉంది. పరిశోధనల్లో ఇబ్బంది పడొద్దు. ప్రపంచంతో పోటీ పడాలి. ఆత్మస్థయిర్యం కోల్పోవద్దు. నాలెడ్జ్ వేరు, కమ్యునికేషన్ వేరు. నాలెడ్జ్, కమిట్మెంట్, కన్విక్షన్ దేశంలో ఏ స్థాయికి ఎదగడానికైనా ఉపయోగపడుతుంది. యూనివర్సిటీలో నియామకాలు, నిర్ణయాల్లో ఎవరి పైరవీలు ఉండవు. రాజకీయ జోక్యం ఉండదు. పైరవీ చేసే వారి ఉద్యోగం తీసేద్దాం. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోండి. పిల్లల జీవితంతో ఆటలాడే హక్కు ఎవరికీ లేదు. కావలసిన సహకారం అందించే బాధ్యత మాది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గారు, సలహాదారులు కేశవ రావు గారు, వేం నరేందర్ రెడ్డి గారు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి గారు, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ ములుగరం గారు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ కాశీం గారు, ప్రజా ప్రతినిధులు, పలు విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## మైత్రివనంలోని కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం




**టి మీడియా ,డిసెంబర్ 10, హైదరాబాద్:** నిత్యం జనంతో రద్దీగా అమీర్‌పేటలోని మైత్రీవనంలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. శివమ్ టెక్నాలజీస్ కోచింగ్ సెంటర్‌లో మంటలంటుకున్నాయి. మంటలు ఎగిసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరగడంతో కోచింగ్ సెంటర్ల నుంచి విద్యార్థులను బయటకు పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సూరత్‌లో భారీ అగ్నిప్రమాదం




**టి మీడియా ,డిసెంబర్ 10, సూరత్:** గుజరాత్ రాష్ట్రం సూరత్‌లోని రాజ్ టెక్స్‌టైల్ మార్కెట్‌లో బుధవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. టెక్స్‌టైల్ మార్కెట్ భవనంలో మంటలు చెలరేగాయి. మంటలు బహుళ అంతస్తులకు చేరాయి. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాసక సిబ్బంది మంటలను అదుపుచేస్తున్నారు. భవనంపై రెండు అంతస్తుల్లో దట్టంగా పొగ కమ్మేసింది. దీంతో భవనంలోని వారు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంపై సూరత్ చీఫ్ ఫైర్ ఆఫీసర్ బసంత్ పారిక్ మాట్లాడుతూ... " మంటలను అదుపుచేసేందుకు సుమారు 20 నుండి 22 అగ్నిమాపక యంత్రాలు వచ్చాయి. మంటలు పూర్తిగా అదుపులో ఉన్నాయి. శీతలీకరణ పనులు కూడా జరుగుతున్నాయి. గిడ్డంగిలోకి ప్రవేశించడం సాధ్యం కాదు. లోపల చాలా సామాగ్రి ఉంది. శీతలీకరణ పనులు జరుగుతున్నాయి. దీనికి కొంత సమయం పడుతుంది. దాదాపు 100 నుండి 125 మంది అగ్నిమాపక అధికారులు, ఉద్యోగులు మంటలను ఆర్పేందుకు నిమగ్నమై ఉన్నారు." అని ఫైర్ ఆఫీసర్ మీడియాకు తెలిపారు.

## ఓటు వేటలో ఒట్టు హవా

### ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్

**టి మీడియా ,డిసెంబర్ 10, హైదరాబాద్ :** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల జోష్? జోరందుకుంది. ప్రత్యర్థులు నువ్వానేనా అన్నట్లు పోటీపోటీగా ఎన్నికల ప్రచారాన్ని చేస్తున్నారు. మొదటి విడత, రెండో విడత, మూడో విడత అనే తేడా లేకుండా అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇంట్లో ఉన్న ఓట్లన్నీ తమకే వేయాలని వినూత్న రీతుల్లో అభ్యర్థులు ప్రచారాన్ని చేస్తున్నారు. ఓటర్లే దేవుళ్లు అంటూ తమ అమూల్యమైన ఓటును తమకే వేయాలని మైక్? సెట్?లలో వీధివీధిన తిరుగున్నారు. మరింత కొంత మంది ఉదయం 5 గంటలకే చలిని కూడా లెక్క చేయకుండా జనాల వద్దకు వెళుతున్నారు. ఇలా విభిన్న రీతుల్లో అభ్యర్థులు ఓట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మరి మొదటి విడతలో ఓటర్లు ఎవరిని తమ ఊరి ప్రథమ పౌరుడిని ఎవరిని ఎన్నుకుంటారో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.



#### మీ ఓటు నాకే అని ఒట్టేయండి

మీకు దండం పెడుతున్న అమ్మా. నేనే ముందు మీ వద్దకొచ్చిన. నాకే మీ ఇంట్లోని ఉన్న ఓట్లన్నీ వేస్తామని నాకు ఒట్టేయండి. లేకుంటే నేను మీ ఇంటి గడప కూడా దాటను. ఈడనే కూర్చుంటా. అవతలి అభ్యర్థి పైసలిచ్చినా తీసుకోండి. మందు సీసా ఇచ్చినా కాదనకుండా తీసుకోండి. ఓటు మాత్రం నాకే వేసి నన్ను దీవించండి అమ్మా. ఇలా ఒక్క ఛాన్స్? ఇవ్వండి. అంటూ పెద్దపల్లి జిల్లాలోని ఓ గ్రామంలో సర్పంచి అభ్యర్థి ఓటర్లతో బలవంతంగా ఇలా చేతిలో చెయ్యేసి ఒట్టు వేయిస్తున్నారు.

#### మా 80 ఇళ్లలోని ఒక్క ఓటు పోదూ

మాది మాటంటే మాట. మా సంఘం వాళ్ల 80 ఇళ్లలోని ఒక్క ఓటు కూడా పొల్లుపోకుండా మీకే వేస్తాం. కావాలంటే మీ ఎదుటే ప్రమాణం చేస్తాం. మా పెద్ద మనుషులంతా కలిసి నిర్ణయం తీసుకున్నాం. మీరేమి దిగులు చెందొద్దు. వేరే అభ్యర్థి వచ్చి ఓట్లు అడిగినా వేస్తామని చెబుతాం. మీకు ప్రమాణం చేసినం. అందుకే అవతలి అభ్యర్థికి ఎట్టి పరిస్థితుల్లోనూ మా ఓట్ల భరోసాను ఇయ్యం. అంటూ ఓ అభ్యర్థి మెదక్? జిల్లాలోని ఓ పంచాయతీలో ఓ సంఘం ప్రతినిధుల అభయం ఇచ్చారు. ఇలానే ఓటు వేటులో అభ్యర్థులు ఒట్టుల హవాను నడిపిస్తున్నారు. ఓటర్లు తమ నుంచి జారి పోకుండా తప్పనిసరిగా ఆ ఓటు తమకే పడాలని ఉద్దేశంతో ప్రమాణాలు చేయించుకుంటున్నారు. చేతిలో చెయ్యేసి మాట తీసుకోవడంతో పాటు వాళ్లు అడిగినంత డబ్బులు ఇస్తున్నారు. ఇలా డబ్బులు ఇవ్వడమే కాకుండా గుడి వద్ద లేదా దేవుడి చిత్రపటాలపై చేయి వేయించి మద్దతు బలాన్ని పెంచుకుంటున్నారు. ఇప్పుడు మొదటి విడత ప్రచారం పూర్తికాగా రెండో, మూడో విడత ప్రచారాలు పంచాయతీల్లో ఈ ఓట్ల పర్వాలు జోరుగా సాగుతున్నాయి.

#### పెద్దవారి కాళ్లపై పడుతున్న అభ్యర్థులు

ఈసారి మూడు విడతల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎక్కువ శాతం యువతే ఉంటున్నారు. సర్పంచి అభ్యర్థుల్లో చాలామంది తమ వయసు కన్నా పెద్దవారు ఎవరు కనిపించినా సరే కాళ్లపై పడుతూ ఓట్లు వేయమని ప్రాధేయపడుతున్నారు. తప్పకుండా బిడ్డా నా ఓటు నాకే వేస్తానని అని చెప్పినా కాళ్లపై నుంచి లేచిన తర్వాత నేరుగా ఆ పెద్దవారి అరచేతిని అభ్యర్థి తలపై పెట్టుకుని తనకే ఓటేయాలని మాటియ్యండనే అభ్యర్థనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు ఓటర్లు కూడా కాస్త తెలివిగా ఆలోచించి ఈ ఓట్ల బాధ నాకేందుకు లే అని ఒట్టెందుకు గానీ నీకు తప్ప ఇంకొకరికి ఓటు ఎందుకేస్తామని తప్పించుకుంటున్నారు.

మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
Spot Speed NEWS
T MEDIA టి-మీడియా సామాజికం... ప్రజల పక్షం...
epaper,www.tmedia.net.in YouTube facebook

## పర్వదినాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

### - టీటీడీ మరో కీలక నిర్ణయం



**టీ మీడియా, డిసెంబర్ 10,తిరుమల :** వీఐపీ బ్రేక్ దర్శనాల విషయంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబరు, వచ్చే ఏడాది జనవరిలో తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పలు పర్వదినాల నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఆయా రోజుల్లో రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23న (కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం), 29న (వైకుంఠ ఏకాదశి ముందు రోజు), డిసెంబరు 30 నుంచి జనవరి 8 వరకు (వైకుంఠ ద్వార దర్శనాలు), జనవరి 25 (రథ సప్తమి) కారణంగా ఈ పర్వదినాల్లో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు టీటీడీ ప్రకటనలో పేర్కొంది. పర్వదినాలకు ముందురోజు వీఐపీ దర్శనాలకు సంబంధించి ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని శ్రీవారి భక్తులు దేవస్థానం సిబ్బందికి సహకరించాలని కోరింది.

#### ఈ-డిప్ ద్వారా టోకెన్లు కేటాయింపు

మరోవైపు తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు ఈ-డిప్ ద్వారా టీటీడీ ఇప్పటికే టోకెన్లు కేటాయించింది. వైకుంఠ ఏకాదశి తొలి 3 రోజుల దర్శన టోకెన్ల కోసం 25,72,111 మంది భక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ-డిప్ ద్వారా 1.76లక్షల టోకెన్లను జారీ చేసినట్టు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా 8,71,340 మంది భక్తులు రిజిస్ట్రేషన్ చేసుకోగా ఈ-డిప్ ద్వారా 57వేల మందికి టీటీడీ టోకెన్లు కేటాయించింది. ఈ నెల 31న దర్శనానికి 8,52,404 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 64 వేల మందికి కేటాయించగా జనవరి 1న దర్శనానికి 8,48,367 మంది రిజిస్ట్రేషన్ 55వేల మందికి టోకెన్ల కేటాయించడం జరిగింది. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా : వైకుంఠ ద్వార దర్శనాల్లో తొలి 3 రోజులు రూ.300 దర్శనం, శ్రీవాణి దర్శనాలు రద్దు చేస్తున్నట్లు టీటీడీ పేర్కొంది. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా అన్ని రకాల సిఫార్సు దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తెలిపింది. వైకుంఠ ఏకాదశి రోజున 70 వేల మందికి దర్శన ఏర్పాట్లు చేయగా గంటకు 4,300 మందికి దర్శనం చేయించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ నెల 30న (వైకుంఠ ఏకాదశి) దర్శన సమయం 20 గంటలు కాగా సామాన్యులకు 15.15 గంటలు, వీఐపీలకు 4.45 గంటలు కేటాయింపుచినట్లు టీటీడీ తెలిపింది. ఈ నెల 31న (వైకుంఠ ద్వాదశి) 75 వేల మందికి దర్శన ఏర్పాట్లు చేయగా 19 గంటల దర్శన సమయం కేటాయించింది. ఈ నెల 31న సామాన్యులకు 16.45 గంటలు, వీఐపీలకు 2.15 గంటలు కేటాయించింది. జనవరి 1న 68 వేల మంది భక్తులకు టీటీడీ దర్శన ఏర్పాట్లు చేసింది. భక్తుల దర్శనాల కోసం 17.30 గంటల సమయం కేటాయించగా సామాన్యులకు 15.15 గంటలు, వీఐపీలకు 2.15 గంటలు కేటాయించినట్లు టీటీడీ వెల్లడించింది.

#### స్థానికుల కోసం రోజుకు 5వేల టోకెన్లు

చివరి 3 రోజులు జనవరి 6,7,8 తేదీల్లో స్థానికుల కోసం రోజుకు 5వేల టోకెన్లు చొప్పున నేడు(డిసెంబర్ 10)న విడుదల చేసింది. వైకుంఠద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ ప్రకటనలో పేర్కొంది. తిరుమలలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించిన విషయం తెలిసిందే.


## లక్ష్యం ఉంటేనే.. దూసుకెళ్లగలం

### మంత్రి శ్రీధర్ బాబు




**టీ మీడియా, డిసెంబర్ 10,హైదరాబాద్:** హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో కొత్త గూగుల్ ఫర్ స్టార్టప్స్ కేంద్రం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుమాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన సందర్భంగా ఈ కేంద్రం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇదో కొత్త ప్రారంభం.. ఇదో కొత్త ప్రయాణం అన్నారు. స్టార్టప్స్ రంగంలో ఎన్నో అవకాశాలున్నాయని శ్రీధర్ బాబు సూచించారు. మా స్టార్టప్ లకు గూగుల్ మెంటర్ గా ఉండటం చాలా సంతోషకరం అన్న ఐటీ మంత్రి ఇప్పుడు యూనికార్న్ సంస్థలకు ఏర్పాటు చేసే అవకాశం వచ్చిందన్నారు. యూనికార్న్ లను తయారు చేయడం కోసమే ఈ కేంద్ర ఉందన్నారు. త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా పెట్టుకోవడంపై విమర్శలు వచ్చాయన్నారు. ఒక లక్ష్యం అంటూ ఉంటేనే ప్రగతి పథంలో దూసుకెళ్లగలం అన్నారు. కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోని మొదటి ప్రైవేట్ రాకెట్ హైదరాబాద్ లోనే తయారైందని మంత్రి వివరించారు. టీహబ్ కు గూగుల్ ను రప్పించేందుకు చాలా శ్రమించామన్నారు. ఇది దేశంలోనే మొట్టమెదటి గూగుల్ స్టార్టప్స్ కేంద్ర అన్నారు. ఇది ప్రపంచంలోనే ఐదో గూగుల్ స్టార్టప్స్ కేంద్రమని మంత్రి వెల్లడించారు.

## తాసిల్దార్ కార్యాలయంలో గోడ పత్రికల కలకలం




**టీ మీడియా, డిసెంబర్ 10,ఉప్పల్:** కుల సంఘాలకు ఇక్కడ ఎలాంటి ఎటువంటి విరాళాలు ఇవ్వబడదు పరోక్షంగా ప్రత్యక్షంగా కాప్రా మండల తాసిల్దార్ కార్యాలయంలో కార్యాలయానికి ప్రహరీ గోడకు రెండు గోడపత్రికల ను రెవిన్యూ అధికారులు అంటించారు. దేనితో తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో సంచలనంగా మారింది. గత కొంతకాలంగా కుల సంఘాలు కులాలను అడ్డుపెట్టుకొని ధర్నాలు కార్యక్రమాలు అంటూ తాసిల్దారుని విరాళాలు ఇవ్వాలని వేధించారు. దీనితో ఆవకైన రెవిన్యూ అధికారులు కుల సంఘాలకు ఎలాంటి ఎటువంటి విరాళాలు ఇవ్వబడవని పోస్టర్ రూపకంగా బహటంగానే చెప్పకనే చెబుతున్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ పరిధిలోని కాప్రా తాసిల్దార్ కార్యాలయంలో ఈ పోస్టర్లు వెలువడటంతో కలకలం రేపు తుంది ఇకముందు ఎవరైనా కుల సంఘాలను అడ్డుపెట్టుకొని వచ్చే కుల సంఘాల నాయకులకు ఇది ఒక పోస్టర్ హెచ్చరిక లాంటిది ఎలా జరుగుతుందో వేచి చూడాల్సిందే కుల సంఘాల నేతలు తాసిల్దార్ కార్యాలయానికి కాకుండా ప్రభుత్వ కార్యాలైనా మున్సిపాలిటీలు సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఎంఈఓ ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ కుల సంఘాల నేతలు కోసం క్యూ కట్టడం కొసమెరుపు.

## గలమెత్తిన షాహీ ఎక్స్‌పోర్ట్ మహిళా కార్మికులు

### కంపనీ గేటు ఎదుట నిద్రించిన మాజీ ఎమ్మెల్యే



**టీ మీడియా, డిసెంబర్ 10,ఉప్పల్:** తమ శ్రమకు తగ్గ జీతం ఇవ్వాలంటూ గత మూడు రోజులుగా షాహి ఎక్సపోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మహిళా కార్మికులు గల మెత్తారు. రాజకీయ నాయకులు సామాజిక వేతలు కార్మికులకు మద్దతు తెలుపుతున్నారు. ఉప్పల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ప్రభాకర్ కార్మికులకు న్యాయం జరగాలంటూ ధర్నా చేయడంతో పాటు అర్ధరాత్రి గేటు ముందే నిద్రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు న్యాయం జరిగే వరకూ అండగా భారతీయ జనతా పార్టీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పది సంవత్సరాల నుండి 10000 రూపాయలు జీతం ఇస్తూ వాళ్ళ శ్రమ దోపిడి కి పాల్పడుతున్న షాహి కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు 2000 మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారని నెలలు రెండు సెలవులు ఉంటాయని. ఇవి కాకుండా సెలవులు ఉపయోగించుకుంటే జీతాలు కట్ చేసి ఎక్కువ పని గంటలు చేయించుకుంటు మానసికంగా ఇబ్బంది గురి చేస్తు వారి కష్టాన్ని దోచుకోవడం సిగ్గుచేటు అన్నారు. కనీసం ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యాలు ఇవ్వకుండా కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కిన అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మహిళలపై అసభ్య పదజాలం ఉపయోగిస్తూ దాడులు సైతం కంపెనీ సూపర్వైజర్లు చేయడం అనుమానిషమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి షాహి కంపెనీ యజమాని పై చర్యలు తీసుకొని కార్మికులు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు

## ఏడేళ్ల బాలికపై అత్యాచారయత్నం

### - ప్రైవేట్ పార్ట్‌లో రాడ్



**టి మీడియా ,డిసెంబర్ 10,ఢిల్లీ బ్యూరో :** ఢిల్లీ నిర్భయ కేసును పోలిన దారుణ అత్యాచార ఘటన గుజరాత్?లో జరిగింది. రాజ్‌కోట్ జిల్లాలోని కూలీ కుటుంబానికి చెందిన ఏడేళ్ల బాలికపై ఓ కామాంధుడు అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు. అంతేకాకుండా ఆమె ప్రైవేట్ భాగంలోకి రాడ్‌ను చొప్పించాడు. ప్రస్తుతం బాలికకు రాజ్‌కోట్‌లోని జనానా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ప్రధాన నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, దహోద్ పంథక్‌కు చెందిన ఒక కూలీ కుటుంబం అత్కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి సమీపంలోని పొలంలో వ్యవసాయ కూలీలుగా పనిచేస్తోంది. డిసెంబర్ 4న ఆ కుటుంబం పొలంలో పనిచేస్తుండగా, వారి ఆరేళ్ల కుమార్తె అక్కడ ఆడుకుంటోంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బాలికను ఎత్తుకుని వెళ్లిపోయాడు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు.

#### బాలిక నోటిని మూసి

నిందితుడు బాలిక నోటిని చేతితో మూసివేసి అఘాయిత్యం చేయడానికి ప్రయత్నించాడు. ఆ తర్వాత, బాలిక కేకలు వేయడంతో ఆమె ప్రైవేట్ భాగంలోకి రాడ్ లాంటి పదునైన ఆయుధాన్ని చొప్పించాడు. దీని కారణంగా బాలికకు తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో నిందితుడు బాలికను అక్కడే వదిలి పారిపోయాడు. అక్కడి కాసేపటికే బాలిక కనిపించకపోవడాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. దీంతో వెతకగా ఓ చోట బాలిక కనిపించింది. అప్పుడు ఆమెకు తీవ్రంగా రక్తస్రావం అవుతుంది. బాలిక పరిస్థితి విషమంగా ఉండటం చూసి, కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను రాజ్‌కోట్‌లోని జనానా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బాలిక చికిత్స పొందుతోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. వెంటనే విచారణ ప్రారంభించారు. నిందితుడిని 30 ఏళ్ల రాంసింగ్ టెర్సింగ్‌గా గుర్తించారు. ఘటన జరిగిన పొలం పక్కన ఉన్న పొలంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు 10 బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని వెతికారని రాజ్‌కోట్ రూరల్ ఎస్పీ విజయ్‌సింగ్ గుర్జార్ తెలిపారు. దాదాపు 100 మంది అనుమానితులను విచారించామని చెప్పారు. 10 మందిని బాలిక ముందు హాజరుపరిచినట్లు వెల్లడించారు. బాలిక ప్రధాన నిందితుడు 30 ఏళ్ల టెర్సింగ్‌ను గుర్తించగా, వెంటనే అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడు మధ్యప్రదేశ్‌లోని అలీరాజ్‌పూర్ నివాసిగా తెలిపారు. అతడు అత్కోట్‌లో పనిచేస్తున్నాడు. నిందితుడికి వివాహమై ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇటీవల, మహారాష్ట్రలోని పుణెలో దారుణ ఘటన వెలుగు చూసింది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లోకి డెలివరీ ఏజెంటు పేరు చెప్పి వచ్చిన యువకుడు, ఓ ఐటీ ఉద్యోగురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతేకాదు బాధితురాలి ఫోన్‌లో సెల్ఫీ తీసుకుని మళ్లీ వస్తానంటూ మెసేజ్ యాడ్ చేసి మరీ వెళ్లాడు. తాను బాధితురాలు ఫోటోలు తీశానని, పోలీసులకు చెబితే వైరల్ చేస్తానని కూడా బెదిరించాడు. అ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి అతడిని అరెస్ట్ చేశారు. ఆ పూర్తి వార్త కోసం ఇక్కడ క్లిక్ చేయండి.

### ఇండిగో సంక్షోభంపై

## హైకోర్టు ఆగ్రహం




**టి మీడియా ,డిసెంబర్ 10,ఢిల్లీ బ్యూరో :** ఇండిగో ఎయిర్‌లైన్ సంక్షోభం ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం, డీజీసీఏ తీరును తప్పుపట్టింది. విమానాల రద్దు, జాప్యాన్ని తీవ్రమైన సంక్షోభంగా పేర్కొన్న కోర్టు.. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇండిగో విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులకు తక్షణ పరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వేలాది విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులకు ఉపశమనం, రీఫండ్స్ కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు బుధవారం విచారించింది. విమానాల రద్దుతో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించడమే కాకుండా ఆర్థిక వ్యవస్థకు కూడా హాని కలిగించాయని కోర్టు పేర్కొంది.

#### టికెట్ల ధరలను ఎలా పెంచుతారు

ఇండిగో విమానాలు రద్దయితే.. దీన్ని అవకాశంగా తీసుకొని టికెట్ల ధరలను అడ్డగోలుగా ఇతర ఎయిర్‌లైన్స్ కంపెనీలు ఎలా పెంచుతాయని నిలదీసింది. ఈ పరిస్థితుల్లో ఇతర విమానయాన సంస్థలు ధరల పెంపును ఎలా సమర్థించుకుంటాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ్, జస్టిస్ తుషార్ ధర్మాసనం ప్రశ్నించింది. ఎఫ్‌డీటీఎల్ నిబంధనల అమలులో జాప్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల దేశవ్యాప్తంగా రెండువేలకుపైగా విమానాలు రద్దుకావడంతో 40వేలకు మందికిపైగా ప్రయాణికులు చిక్కుకుపోయారని ధర్మాసనం పేర్కొంది. ప్రయాణికుల భద్రతలో రాజీపడకూడదని.. పైలట్ అలసట ప్రమాదాన్ని పెంచుతుందని, నియంత్రణ సంస్థలు ముందస్తు చర్యలు తీసుకొని ఉండాల్సిందని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

#### అసౌకర్యానికి పరిహారం చెల్లించాల్సిందే

ఇండిగో విమానాల రద్దు తర్వాత ఇతర ఎయిర్‌లైన్ కంపెనీలు చార్జీలను 40వేలకుపైగా పెంచడంపై కోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఇది అవకాశవాదం కాదా? అంటూ బెంచ్ నిలదీసింది. గతంలో నాలుగు, ఐదువేలకు లభించే విమాన టికెట్ల ధరలు ఇప్పుడు పెరిగాయని.. ఈ ఛార్జీలు 39వేల వరకు ఎలా పెరుగుతాయని కోర్టు ప్రశ్నించింది. ప్రస్తుత డీజీసీఏ మార్గదర్శకాలు, భారత ఎయిర్‌లైన్స్ చట్టం ప్రకారం ప్రభావితమైన ప్రయాణికులందరికీ పూర్తి పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. విమానాల రద్దుకు సంబంధించి మాత్రమే కాకుండా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రయాణీకుల హక్కుల ముఖ్యమని ధర్మాసనం తేల్చి చెప్పింది. డీజీసీఏ తరపు న్యాయవాదులు ఈ విషయంలో ఇండిగోకు నోటీసులు జారీ చేశారని.. చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

#### మళ్లీ జనవరి 22న విచారణ

ఇండిగో సంస్థ తప్పుకు క్షమాపణలు చెప్పిందని.. పరిస్థితిని సరిదిద్దుతామని హామీ ఇచ్చిందని కేంద్రం పేర్కొంది. ఈ కేసు తుదిపరి విచారణ జనవరి 22న జరుగుతుందని తెలిపింది. ప్రస్తుతం ఇండిగో గురించి ఏమీ చెప్పలేమని.. పరిహారం విషయంలో ఆదేశాలు పాటించాలని చెప్పింది. కమిటీ దర్యాప్తు జనవరి 22 నాటికి పూర్తయితే.. నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఇండిగో అంశంపై దాదాపు గంటపాటు విచారణ సాగింది. ఇండిగో తరఫున సందీప్ సేథి విచారణకు హాజరయ్యారు. ఫ్లయిట్ రోస్టర్ కారణంగా పరిస్థితి తలెత్తలేదని.. చాలా కారణాలున్నాయని తెలిపారు. పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోర్టు చెప్పింది. అయితే, తమకు వ్యతిరేకంగా తీర్పు ఉండకూడదని చెప్పగా.. ఇండిగో తప్ప మిగతా కంపెనీలన్నీ ఆదేశాలు పాటించాయని కోర్టు గుర్తు చేసింది.

#### ఇండిగోకు కీలక ఆదేశాలు

డిసెంబర్ 5న సంక్షోభం సాంకేతిక లోపంతో సహా అనేక కారణాలతో ఈ పరిస్థితి ఎదురైందని చెప్పగా, ప్రస్తుతం 90శాతం సామర్థ్యంతో విమానాలు నడుస్తున్నాయని సేథీ కోర్టుకు తెలిపారు. ఈ అంశంపై విచారణ జరుగుతుందని, విమానాల సేవలను తిరిగి ప్రారంభం కావడం సంతోషమేనన్న కోర్టు.. వారం పాటు ఇబ్బందులు పడ్డ ప్రయాణీకుల గురించి ఆలోచించాలని చెప్పింది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చెపుతుంది? అంటూ హైకోర్టు సీజే ప్రశ్నించారు. పరిహారం చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని.. తాము ఇంకా ఆదేశాలు గురించి ప్రస్తావించలేదని.. కానీ, పరిహారం చెల్లింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఇండిగోను ఆదేశించింది.